

పవర్ గేమ్ స్టార్ట్

పాలమూరు మునిసిపాలిటీ కైవసానికి కాంగ్రెస్ ఎత్తులు



కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

- ఎన్‌పీ, సురేందర్, ఆనంద్‌గౌడ్ ద్వారా ఆపరేషన్
- అవిశ్వాసానికి అనుమతించాలని కలెక్టర్‌కు విన్నపం
- 32 మంది కౌన్సిలర్ల సంతకాలతో వినతి పత్రం
- సజావుగా సాగితే నెలాఖరులో చైర్మన్‌గా ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పాలమూరులో పవర్ గేమ్ షురూ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. పాలక వర్గాలకు ఏడాది మాత్రమే గడువున్నప్పటికీ మునిసిపాలిటీల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ద్వితీయ శ్రేణి క్యాడర్ చేపట్టిన ఆపరేషన్ ఫలిస్తోంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపాలిటీ అయిన మహబూబ్‌నగర్‌ను హస్తగతం చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలించడంతో చైర్మన్, వైస్ చైర్మన్ సహా పురపాలికలో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కార్యాచరణ మొదలుపెట్టారు.

అవిశ్వాసానికి అనుమతించాలని కలెక్టర్‌కు విన్నపం

49 మంది కౌన్సిలర్లున్న మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో చైర్మన్ కెసీ నరసింహులు, వైస్ చైర్మన్ టి.గణేశ్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అనుమతించాలని కోరుతూ 32 మంది కౌన్సిలర్లు వారి సంతకాలతో కూడిన లేఖను శనివారం కలెక్టర్ జి.రవినాయక్‌కు అందజేశారు. ఆ లేఖలో కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం సభ్యులతో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన 20 మంది కౌన్సిలర్లు సైతం సంతకాలు చేశారు. కౌన్సిల్‌లో వాస్తవానికి బీఆర్‌ఎస్‌కు 36 మంది సభ్యులుండగా, ఇప్పటికే 20 మంది సభ్యులు కాంగ్రెస్‌వైపునకు రాగా, మరికొందరు సైతం లైన్లో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆనంద్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఈ కౌన్సిలర్లంతా శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

సైలెంట్‌గా చక్రం తిప్పిన ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మునిసిపాలిటీ పాలకవర్గాన్ని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మునిసిపాలిటీలో మూడొంతుల సభ్యులు బీఆర్‌ఎస్ వారే ఉన్నప్పటికీ.. వారిలో సింహభాగం పనుల విషయంలో, నిధుల కేటాయింపు విషయంలో వార్డుల మధ్య తీవ్ర స్థాయిలో వివక్ష చూపుతున్నారంటూ పలువురు ఎమ్మెల్యేకు నేరుగా టచ్‌లోకి వచ్చారు. దాంతో ఎమ్మెల్యే పాలకవర్గ మార్పుపై దృష్టి సారించారు. నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కౌన్సిలర్ల పరిస్థితిపై ఆరాతీసిన ఎమ్మెల్యే పవర్ ఛేంజ్ ఆపరేషన్‌కు తెరదీశారు. రెండు రోజుల క్రితం నవాబుపేట సమీపంలో ఒక రహస్య ప్రదేశంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే సైతం హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు అవిశ్వాసానికి నోటీసులివ్వాలని నిర్ణయించారు. దీంతో శనివారం కలెక్టర్‌కు నోటీసులు అందించారు.

సీఎం దృష్టికి అంశం

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల తిరుగుబాటు, అవిశ్వాసం పెట్టే అంశాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఎమ్మెల్యేను ఆదేశించారని ఈమేరకు ముఖ్య నాయకులకు, కౌన్సిలర్లకు కూడా స్పష్టమైన సందేశమందినట్లు కాంగ్రెస్ ముఖ్యులు చెబుతున్నారు. దాంతో అంశంపై సీఎం దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయి అభివృద్ధి కోసమేనంటోన్న కాంగ్రెస్

ఏడాది కాలమే గడువు, మూడొంతుల సభ్యులు బీఆర్‌ఎస్‌కు చెందినవారే ఉన్నప్పటికీ పాలవకర్గంపై అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్నకు కాంగ్రెస్ నాయకులు భిన్న సమాధానం చెబుతున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పాలకవర్గం నిధుల ఖర్చు విషయంలో పూర్తి వివక్ష చూపారని, దీనిపై ఆ పార్టీ కౌన్సిలర్లే స్వయంగా మొరపెట్టుకుంటున్నారని అంటున్నారు. నాలుగేళ్ల కాలంలో కొన్ని వార్డులకే అన్ని నిధులిచ్చారని, కౌన్సిలర్లకు కనీస గౌరవం దక్కలేదని బాధపడ్డారని చెబుతున్నారు. దానికితోడు పూర్తి ఏకపక్ష వైఖరితో పాలన సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న సంక్షేమం నేరుగా ప్రజలకు చేరాలంటే పాలకవర్గంలో పారదర్శక నాయకత్వం ఉండటం అవసరమనే ఉద్దేశం, మెజారిటీ కౌన్సిలర్ల స్వచ్ఛంద ఆమోదంతో ఈ చర్యకు దిగినట్లు చెబుతున్నారు. ఎవరినీ ప్రలోభాలకు లోను చేయలేదని, కనీసం మిగిలిన ఏడాది కాలమైనా అన్ని వార్డులకు, గల్లీలకు సమానంగా నిధుల కేటాయింపు జరిగితే, కొద్దో, గొప్పో పనులు చేయగలుతామనే విశ్వాసంతో కౌన్సిలర్లే ముందుకు వచ్చి పాలకవర్గంపై అవిశ్వాసం ప్రతిపాదించారని చెబుతున్నారు.

15 రోజుల ప్రాసెస్

అవిశ్వాస తీర్మానం కోసం సభ్యులు కలెక్టర్‌ను కలువగా, సభ్యులు ఇచ్చిన ప్రతిని ఆయన మునిపిపల్ కమిషనర్‌కు పంపించనున్నారు. కమిషనర్ అందులో సభ్యులు పెట్టిన సంతకాలు వారివేనా? కాదా? అన్న విషయంలో సభ్యులను ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడి, వారి అభిప్రాయాలు తీసుకుని కలెక్టర్‌కు నివేదిస్తారు. ఆ తరువాత కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. ముందుగా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారు. ఓటింగ్‌లో అవిశ్వాసానికి అనుకూలంగా హాజరైన వారిలో 50 శాతం ప్లస్ ఒకరు మద్దతిస్తే చైర్మన్ పదవి పోతుంది. ఆ తరువాత కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఈనెలఖరులోగా ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయి.

కౌన్సిలర్ల ఆత్మగౌరవం కోసమే

పాలమూరు మునిసిపాలిటీలో కౌన్సిలర్ల ఆత్మగౌరవం కోసమే ప్రస్తుత పాలకవర్గ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి అనుమతించాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీవెంకటేశ్, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత పాలకవర్గం నిధుల కేటాయింపుల్లో కౌన్సిలర్లకు సమ ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. కొన్ని వార్డులకు నిధులే రాలేదని, కొన్ని వార్డులకే అభివృద్ధి పరిమితమైందని, ఈ వ్యత్యాసాలను పూడ్చేందుకే పాలకవర్గాన్ని గద్దెదించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం వల్ల అవిశ్వాస తీర్మానం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరులో ఇక స్వేచ్ఛగా పరిపాలన సాగనుందని చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్‌ల సభ్యత్వం రద్దు చేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన కౌన్సిలర్లను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఈ నిబంధనలు గుర్తులేవా? అని నిలదీశారు.

పాలమూరులో నేడు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



- మాడ్రన్ హై స్కూల్‌లో ఏర్పాట్లు
- ఉదయం 10 గంటలకు ప్రారంభం..

మహబూబ్‌నగర్, జనవరి 6: ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ము గ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన జిల్లా స్థాయి పోటీలు ఆదివారం పాలమూరులో నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల మాడ్రన్ హై స్కూల్‌లో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు ముత్యాల ముగ్గుల పోటీలను సంప్రదాయంగా నిర్వహిస్తూ వస్తోంది. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గుకు ప్రాధాన్యం ఉంటుంది. మహిళలు ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గు వేసేందుకు రెండు గంటల సమయం ఉంటుంది. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, డీఈవో రవీందర్, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మనోహర్ హాజరు కానున్నారు.

తల్లి మందలించిందని

విద్యార్థిని ఆత్మహత్య

- ధరూరులో ఘటన

ధరూరు, జనవరి 6: ఇంట్లో పని సరిగా చేయడం లేదంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమార్తె బీపీ మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ హుసేన్ తెలిపిన వివరాల ప్రకారం.. ధరూరుకు చెందిన మాల లక్ష్మి, అంజనేయులు కుమార్తె(15) పదో తరగతి చదువుతోంది. ఇంట్లో సరిగా పని చేయడం లేదని ఈ నెల నాల్గో తేదీన సాయంత్రం తల్లి మందలించింది. దాంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమ్మమ్మ వాడే సుమారు ఇరవై బీపీ మాత్రలు వేసుకొని అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచనల మేరకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మృతి చెందింది. తల్లి మాల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మంచు అందాలు

పది రోజులుగా నాగర్‌కర్నూల్ జిల్లాలో మంచు దుప్పటి పరుచుకుంటోంది. తెల్లవారుజామునే కమ్ముకుంటున్న పొగ మంచు వల్ల వాహనదారులు, చలితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తుండగా, జనం చలి మంట కాపుకోవడంతో పాటు స్వెటర్లు ధరిస్తున్నారు. చలి వణికిస్తున్నా.. మంచులో తడిసిన అందాలను చూసి పలువురు నేత్రానందం పొందుతున్నారు.
- స్టాఫ్ ఫొటో గ్రాఫర్, మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్



మంచు దుప్పటిలో నాగర్‌కర్నూల్ పట్టణం



నాగర్‌కర్నూల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద కురుస్తున్న మంచు



మినీ ట్యాంక్‌బండ్ వద్ద మంచులో కలిసిపోయిన బుద్ధుడి విగ్రహం



చలికి ఆటోలో చీరలు కప్పుకొని వెళ్తున్న మహిళలు



పంట పొలాలపై కురుస్తున్న మంచు

శోకసంద్రం

- బాలానగర్ ఘటనతో విషాదఛాయలు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి


జడ్చర్ల, జనవరి 6: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను శోకసంద్రంలో ముంచింది. ఈ ఘటనతో బాలానగర్, బీబీ నగర్ తండా, మోతీఘనపూర్ గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రతీ శుక్రవారం జరిగే సంతలో కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం వచ్చి, తిరుగు ప్రయాణం కాగా.. ఆటో, బైక్‌లను డీసీఎం ఢీ కొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనలో మోతీఘనపూర్‌కు చెందిన భర్త రాజు తీవ్రంగా గాయపడగా, భార్య సునీత(32), కుమార్తె పింకీ(8)లు మృతి చెందారు. బీబీనగర్ తండాకు చెందిన పస్నీ(50), జున్ను(3) కూడా చనిపోయారు. బాలానగర్ మండల కేంద్రంలో ఉంటున్న బద్రుసింగ్, బీబీనగర్ తండాకు చెందిన మౌనిక, మోతీఘనపూర్‌కు చెందిన రాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బద్రుసింగ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో, మోతీఘనపూర్‌కు చెందిన రాజు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల అంత్యక్రియలు ఆయా గ్రామాల్లో శనివారం కుటుంబీకుల రోదనల మధ్య నిర్వహించారు. బాధితులకు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి, పరామర్శించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ కల్యాణి నాయక్ కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు.

పుట్టిన రోజు కేకు కోసం వచ్చి మృత్యువు ఒడిలోకి జశ్వంత్


బాలానగర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న జశ్వంత్(10) తన పుట్టిన రోజు ఉండటంతో కేకు తీసుకెళ్లేందుకు వచ్చి ప్రమాదంలో చనిపోయాడు. పుట్టిన రోజు మృత్యువు రోజుగా మారిందంటూ కుటుంబ సభ్యుల రోదన పలువురి కంటతడిపెట్టించింది.

బాధాకరం : ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

బాలానగర్ వద్ద జరిగిన సంఘటన బాధాకరమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన శనివారం పరామర్శించారు. మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్, రాజాపూర్, రంగారెడ్డిగూడ కూడళ్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ బ్రిడ్జీ నిర్మాణాల అవశ్యకతను ఇప్పటికే ఆర్ అండ్ బీ, జాతీయ రహదారి శాఖ అధికారులకు తెలియచేసినట్లు చెప్పారు. తాను ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 50 వేలు సొంతంగా పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు.







లారీని ఢీ కొట్టిన బొలెరో

- బొలెరో డ్రైవర్, వాహనంలో ఉన్న 30 గొర్రెలు మృతి
- ఇద్దరికి గాయాలు


జాతీయ రహదారిపై జడ్చర్ల సమీపంలో లారీని ఢీ కొట్టిన బొలెరో

జడ్చర్ల, జనవరి 6 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపాన జాతీయ రహదారిపై నిబంధనలు పాటించకుండా నిలిపిన లారీని, ఆ వెనకాల వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఆ వాహన డ్రైవర్ దుర్మరణం చెందాడు. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ఓ లారీని డ్రైవర్ జడ్చర్ల సమీపానికి రాగానే 44వ జాతీయ రహదారిపై నిలిపాడు. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామానికి చెందిన శంకరప్ప(36) బొలెరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఊట్కూరుకు చెందిన కుర్వ నర్సిములు, రాములు తమ గొర్రెలను కొన్నాళ్ల క్రితం మేత కోసం వరంగల్ జిల్లాకు తీసుకెళ్లారు. ఈనెల 5న (శుక్రవారం) 30 గొర్రెలను శంకరప్పకు చెందిన బొలెరో వాహనంలో తీసుకొని ఊట్కూరు వస్తున్నారు. జడ్చర్ల సమీపానికి రాగానే జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపిన లారీని గమనించలేక (తెల్లవారుజామున) ఈ బొలెరో వాహనం ఢీకొన్నది. ఈ సంఘటనలో బొలెరో వాహనంలో ఇరుక్కుని తలకు, ఛాతికి, కాళ్లకు బలమైన గాయాలైన డ్రైవర్ శంకరప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనంలో ఉన్న కుర్వ నర్సిములు, రాములుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఈఎంటీ శివకుమార్‌రెడ్డి, పైలట్ మల్లేశ్వర్‌రెడ్డిలు జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారి వద్ద రూ.15వేలు ఉండడంతో ఆ నగదును డీజీహెచ్ సీఎంఓకు 108 అంబులెన్స్ సిబ్బంది అప్పగించారు. రోడ్డుమధ్యలో ఎలాంటి సిగ్నల్‌లేకుండా లారీ నిలపడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని, లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడు శంకరప్ప భార్య లక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు, తప్పిన ప్రమాదం

ఊర్కొండ, జనవరి 6 : కారు చెట్టుకు ఢీకొని తృటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. ఊర్కొండ మండల శివారులో ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం వేళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్నది. దాంతో కారులోని బెలూన్లు తెరచుకోవడంతో మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన డ్రైవర్ అక్బర్‌కు స్వల్ప గాయాలు కాగా, కారు పూర్తిగా దెబ్బతిన్నది. కారు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లెనిన్ తెలిపారు.

50 గ్రాముల గంజాయి పట్టివేత

మహబూబ్‌నగర్, జనవరి 6 : జిల్లా కేంద్రంలోని మోతీనగర్‌లో ఖాజాపాషా అనే వ్యక్తి దగ్గర 50 గ్రాముల ఎండుగంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు శనివారం అతని వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, ఎస్సైలు నరేష్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో..

మక్తల్, జనవరి 6 : మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామ సమీపంలో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో 420గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు మక్తల్ సీఐ రాంలాల్, ఎస్సై పర్వతాలు తెలిపారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా పరిధిలో గంజాయి నిర్మూలన ప్రధాన ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని గుడిగండ్ల గ్రామ శివారులోని జాతీయ రహదారిపక్కన ఒరిస్సాకు చెందిన ప్రదీన నాయక్ అనే వ్యక్తి కవర్‌లో గంజాయి పట్టుకొని ఉండటతో పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి అతడి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేస్తున్నారు. నిందితుడిని విచారించగా తనది ఒరిస్సా రాష్ట్రమని, గుడిగండ్ల గ్రామ శివారులో నాలుగేళ్ల నుంచి ఇటుక బట్టీల్లో పనులు చేస్తున్నట్లు తెలిపారు. అతడి వద్ద ఉన్న 420గ్రాముల గంజాయిని పట్టుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

● కొత్తపల్లి : కొత్తపల్లి మండల కేంద్రంలోని గుట్టు చప్పుడు కాకుండా మిరపతోటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం గుర్తించారు. కొత్తపల్లికి చెందిన మున్నూరు నర్సింహులు తన వ్యవసాయ పొలంలో మిరప సాగుతోపాటు గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి 1.315గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కోస్గి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, మద్దూర్ మండల ఎస్‌ఐ సురేష్, తహసీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి బంగారు, కాంస్య పతకాలు


క్రీడాధికారితో ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న లక్ష్మణ్ నాయక్

మన్ననూర్, జనవరి 6 : సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి మాస్టర్ గేమ్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు విస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రతిభ చాటి మూడు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు. శనివారం జరిగిన లాంగ్ జంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, డిస్కస్‌త్రోలో కాంస్య పతకం సాధించారు. లక్ష్మణ్ నాయక్‌కు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఆసక్తి, ఆయన అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే క్రీడల్లో పాల్గొంటూ ఉంటారు. క్రీడల్లో ప్రతిభ చాటుతున్న ఉపాధ్యాయుడికి స్థానిక గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అఖిల భారత అథ్లెటిక్స్ పోటీల్లో

నల్లమల యువకుడికి బంగారు పతకం


జాతీయ అథ్లెటిక్స్ అధికారులతో రూ.50వేల చెక్కును అందుకుంటున్న రమేష్ చంద్ర

మన్ననూర్, జనవరి 6 : చెన్నైలో జరుగుతున్న అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన రమేష్ చంద్ర అనే యువకుడు ప్రతిభ చాటి బంగారు పతకాన్ని సాధించాడు. శనివారం తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో దేశంలోనే రెండో అతి పెద్ద అథ్లెటిక్స్ ఈవెంట్‌లో ఆఫ్ మారథాన్‌లో 20మందితో కలిసి ప్రాతినిధ్యం వహించిన రమేష్ చంద్ర 21 కిలో మీటర్ల పరుగుపందెంలో ఒక గంట పది నిమిషాల్లోనే గమ్యస్థానాన్ని చేరుకొని ఆల్‌ఇండియా లెవల్‌లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని సాధించాడు. నల్లమల ప్రాంతానికి చెందిన రమేష్ చంద్ర ప్రతిభ చాటడంపై మన్ననూరు గ్రామ సర్పంచ్ శ్రీరాంనాయక్, ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, స్థానిక ఉమామహేశ్వర తండా గిరిజన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కుస్తీ పోటీలు



తుపతురాల గ్రామంలో సాగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీలు



అయిజ, జనవరి 6 : జోగుళాంబ గద్వాల జిల్లాలో మొదటి సారిగా జాతీయ స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. అయిజ మునిసిపాలిటీ పరిధిలోని తుపతురాల గ్రామంలో మేరాసాబ్ ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పోటీలలో పాల్గొనటానికి వచ్చారు. 32 మంది ఈ పోటీలలో తలపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన సైఫ్ మొదటి స్థానంలో, మహారాష్ట్రకు చెందిన ప్రదీప్ షిండే ద్వితీయ స్థానంలో, హైదరాబాద్‌కు చెందిన ముస్తఫా తృతీయ స్థానంలో, సంగారెడ్డికి చెందిన రమేష్ గుప్తా నాలుగో స్థానంలో నిలిచారు. ఈ పోటీలను మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సంకాపూర్ రాముడు ప్రారంభించారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

» నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాల కూల్చివేత

కొల్లాపూర్, జనవరి 6 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో కృష్ణానది తీరాన వీఐపీ ఘాట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరిగాయంటూ హైలాండ్ కాటేజీ నిర్మాణాలపై లోకల్ బాడీ జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ నేతృత్వంలో శనివారం అధికారులు కొరడా ఝుళిపించారు. అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమశిల గ్రామంలో నూతనంగా నిర్మించిన హైలాండ్ కాటేజీలకు అనుమతులు లేవని రెసిడెన్షియల్ కింద జీప్లస్-1 కట్టడాలకు గ్రామపంచాయతీ నుంచి అనుమతులు పొంది నిబంధనలను అతిక్రమిస్తూ జీప్లస్-2 కట్టడాలు జరిపి కమర్షియల్‌గా కాటేజీలు నిర్మించారని లోకల్‌బాడీ అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. అక్రమ కట్టడాలు జరిపారని డిసెంబరు 15న నోటీసులు జారీ చేస్తూ పంచాయతీరాజ్ చట్టం 268 సెక్షన్ కింద ఇచ్చిన అనుమతులు రద్దయ్యాయని సోమశిల గ్రామ



లోకల్ బాడీ జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో మాట్లాడుతున్న కాటేజీ యాజమాన్యం



అనుమతులు లేని కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

కార్యదర్శి సత్యనారాయణశర్మ సదరు కాటేజీ యాజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయినా అక్రమ నిర్మాణాలు తొలగించుకోకపోవడంతో శనివారం హైలాండ్ కాటేజీల్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నిర్మాణాలను జేసీబీ ద్వారా అధికారులు తొలగించారు. జీప్లస్-2లో జరిగిన కట్టడాలు మెట్లు పైకప్పు భాగంలో డ్రిల్లింగ్ మిషన్‌తో పది రంధ్రాలు వేసి అదేవిధంగా చుట్టూ ఉన్న కాంపౌండ్ ముందు భాగంలో ఉన్న అరుగుని అధికారులు తొలగించారు. మరో రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించుకోవాలని ఆదేశించారు. స్పందించకుంటే నోటీసులు లేకుండా చర్యలు చేపడుతామని లేదా నిర్మాణాలపై పెనాల్టీ టాక్స్ విధించబడుతుందని అధికారులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో మనోహర్, సోమశిల గ్రామ కార్యదర్శి సత్యనారాయణశర్మ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

» అత్తింటి వారిపై కేసు నమోదు

ఉప్పునుంతల, జనవరి 6: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధింపులపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని దేవదారికుంటతండా గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పునుంతల మండలంలోని దేవదారికుంటతండా గ్రామానికి చెందిన క్రాత్రావత్ మౌనిక 2019వ సంవత్సరం నుంచి 2020 వరకు అచ్చంపేట పట్టణంలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా, అదే ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న లింగాల మండల కేంద్రంలోని బంజారా కాలనీకి చెందిన ముడావత్ శంకర్ మొదటి భార్యకు విడాకులు ఇచ్చాను.. నిన్ను పెళ్లి చేసుకుంటానని మౌనికను 2020 జూలై 30న గ్రామ పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. పెళ్లి సమయంలో 20 తులాల బంగారం, 30 తులాల వెండి, 10 లక్షల నగదు కట్నం ఇచ్చారు. పెళ్లి అయి ఆరు నెలల పాటు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం రూ.50 లక్షలు తీసుకువస్తే నర్సింగ్ హోమ్ పెడతానని భర్త శంకర్‌తో పాటు అత్త జగిని, భర్త అన్న పర్వతాలు, ఇతడి భార్య లీలావతి, ఆడపడుచు పద్మ, ఈమె భర్త హన్మంత్ జూలై 25న మౌనికను ఒక కూతురు, 5 నెలల గర్భవతి ఉన్న సమయంలో అత్తింటి వారు ఇంటి నుంచి బయటికి గెంటేశారు. రూ.50 లక్షలు కట్నం తీసుకరావాలని మానసికంగా, శారీరకంగా వేధించారు. పలుమార్లు మౌనిక కుటుంబ సభ్యులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినప్పటికీ అదనపు కట్నం తీసుకరావాలని ఒత్తిడి చేశారు. కాగా, 2023 నవంబరు 18న శంకర్ తన భార్య కాపురానికి రావడం లేదని జిల్లా కోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా అచ్చంపేట పట్టణంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పంచాయితీలోనే మౌనిక తల్లి లక్ష్మిపై శంకర్ దాడి చేశాడు. తల్లి లక్ష్మి శంకర్‌పై అప్పట్లో అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే, అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మౌనిక శనివారం ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు అత్తింటి వారి(ఆరుగురి)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి, జనవరి 6 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గట్టునెల్లికుదురుకు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కథనం ప్రకారం.. శుక్రవారం మల్లయ్య(45) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగాడు. దాంతో అతన్ని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శవాన్ని శనివారం స్వగ్రామానికి తర లించారు. భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వసురామ్‌నాయక్ తెలిపారు.

జిల్లావాసికి అరుదైన గౌరవం

» గవర్నర్, ఇస్రో చైర్మన్ చేతులమీదుగా అందుకున్న పీహెచ్‌డీ పట్టా



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న కొత్త వెంకటరమణ

మిడ్జిల్, జనవరి 6 : జిల్లాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గవర్నర్, ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వల్లభరావుపల్లి గ్రామానికి చెందిన కొత్త వెంకటరమణ అసిస్టెంట్ ప్రొఫెసర్. ఈయన హైదరాబాద్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ కొత్త వెంకటరమణ నాదర్గుల్ మాటూరి వెంకటసుబ్బారావు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాలిమర్ శాస్త్రం (భౌతిక శాస్త్రం)పై డాక్టర్ ఎం. చంద్రశేఖర్, రిటైర్డ్ రెక్టార్ (గైడ్) డాక్టర్ మధుసూదన్‌రెడ్డి కోగైడ్‌ల ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఇందుకుగాను శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఇస్రో చైర్మన్ డాక్టర్ శ్రీధరపనిక్కర్ సోమనాథ్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు, పలువురు గ్రామస్థులు అభినందనలు తెలిపారు. వెంకటరమణ సోదరులు శోభన్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా సంతోషం వ్యక్తం చేశారు.

నేడు టీఎన్జీవో భవనంలో సెమినార్

» పాల్గొననున్న ప్రొఫెసర్ హరగోపాల్

గద్వాల టౌన్, జనవరి 6 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఈనెల 7వ తేదీ ఆదివారం సాయంత్రం 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఏమిటి' అనే అంశంపై సెమినార్ ఏర్పాటు చేశామని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎండి.ఇక్బాల్‌బాషా, కోకన్వీనర్ డి.హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో ప్రధాన వక్తగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ హాజరవుతారన్నారు. ఉద్యమం ద్వారా ఏర్పడిన తెలంగాణలో పదేళ్ల పాటు సాగిన పాలనలో అణచివేతకు గురైన ప్రజలు మార్పును కోరడంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజాస్వామికవాదుల ఒత్తిడితో కాంగ్రెస్ పాలకులు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేపడతాం అంటున్న నేపథ్యంలో అది ఏవిధంగా ఉండాలో అని చర్చించడమే సెమినార్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు సెమినార్‌కు హాజరు కావాలన్నారు.

కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల క్రైం, జనవరి 6 : జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ భరోసా - సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్, చిల్డ్రన్ సెంటర్‌లో కాంట్రాక్ట్ బేస్ నియామకాలపై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ రితిరాజ్ శనివారం తెలిపారు. రాష్ట్ర పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ పర్యవేక్షణలో నడిచే భరోసా - సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్, చిల్డ్రన్ సెంటర్‌లో అర్హత గల మహిళల నుంచి దరఖాస్తులను కోరుతున్నారన్నారు. కాంట్రాక్ట్ బేస్ కింద ఒక సంవత్సరం పాటు ఈ పోస్టులకు నియమించబడి తదనంతరం సంవత్సరానికి ఒకసారి వారి నియామకాన్ని పొడిగించడం జరుగుతుందన్నారు. ఇందులో సపోర్ట్‌పర్సన్ పోస్టు కోసం ఎంఎస్‌డబ్ల్యూ/చైల్డ్ డెవలప్‌మెంట్/సైకాలజీ కల్గి ఉండి రెండు సంవత్సరాల అనుభవంతో 25-35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. అలాగే, లీగల్ స్టోర్ అధికారి పోస్టు కోసం ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎంతో రెండు సంవత్సరాల అనుభవం ఉండి, 25-40 సంవత్సరాలు ఉండాలన్నారు. ఈ పోస్టుల కోసం అర్హులైన, ఆసక్తి ఉన్న మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్పీ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాలస్వామి (ఫైల్)

బల్మూరు, జనవరి 6 : తన వ్యవసాయ పొలానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం గోదల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలస్వామి(36) గోదల్ గ్రామం నుంచి వల్లభాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కల్వర్టులో కింద పడి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి 108కు సమాచారమివ్వగా వాహనం వచ్చేసరికి బాలస్వామి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, జనవరి 6 : జడ్చర్ల పట్టణంలోని క్లబ్‌రోడ్డులో ఓ ఇంట్లో నివాసం ఉంటున్న యువకుడు(26) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడని స్థానికులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడిని కుటుంబసభ్యులు, స్వగ్రామానికి తీసుకెళ్లారని వివరించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

మహమ్మదాబాద్, జనవరి 6 : మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం షేక్‌పల్లితండాకు చెందిన మహేష్ (28) అనే యువకుడు అదృశ్యమయ్యాడని యువకుడి తల్లి క్రాత్రావత్ పున్నిబాయి శనివారం ఫిర్యాదు చేసిందని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ నంచర్ల గేట్‌లో జిరాక్స్ నడుపుకుంటూ అక్కడే నివసిస్తున్నాడు. గత నెల 31న ఉదయం 11 గంటలకు మహేష్ జిరాక్స్ షాపు సామగ్రి కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్‌గా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శనివారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్వంగలో గుడిసె దగ్ధం

తెలకపల్లి, జనవరి 6 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని కార్వంగ గ్రామానికి చెందిన గోపాస్ చిన్న నిరంజన్ తండ్రి కేశవులు తమ సొంత నివాసం గుడిసెలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పత్తి అమ్మకంలో వచ్చిన డబ్బులు మూడు లక్షల రూపాయలు బూడిదపాలైనట్లు ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే ఇంట్లోని 2లక్షల సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

అమ్మా'పూర్'లో సౌకర్యాల లేమి

» కురుమూర్తిరాయుడికి ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా

» ఇబ్బందులు పడుతున్న భక్తులు



జాతర మైదానంలోనే ఎండలో దాసంగాలు వండుతున్న భక్తురాలు (ఫైల్)

చిన్నచింతకుంట, జనవరి 6 : తెలంగాణాలో పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న శ్రీకురుమూర్తి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదాయం ఉన్నా, అభివృద్ధిలో మాత్రం సున్నా అన్న చందంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలిసిన స్వామివారి క్షేత్రం తెలంగాణా ప్రాంతంలోనే ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే స్వామివారికి ప్రతిఏటా రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతున్నా, ఇక్కడ ఆలయంలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా మారిందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దాతలపైనే భారం

కురుమూర్తి ఆలయ అభివృద్ధి విషయంలో దేవాదాయ శాఖ మాత్రం ఆలయాన్ని అభివృద్ధి పర్చటంలో నిండా నిర్లక్ష్యం వహిస్తున్నదని తెలుస్తోంది. కేవలం ఆలయ అభివృద్ధి దాతలపైనే భారం వేసింది. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలోనూ, జాతర మైదానంలోనూ దాతలు సమకూర్చిన నిధుల ద్వారానే పలురకాల అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పటికీ కేవలం దాతలు చేసే అభివృద్ధి పనులపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారు తప్పా దేవాదాయశాఖ తరుపున అభివృద్ధి పనులపై అంతగా దృష్టి సారించకపోవటంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దాసంగాలకు నిలువనీడ లేని వైనం

భక్తులు దాసంగాలు పెట్టేందుకు నిలువనీడా లేకుండా పోతున్నది. కేవలం గతంలో ఏర్పాటుచేసిన కొద్దిపాటి రేకుల షెడ్లు ఉన్నా అవి భక్తుల రద్దీకి తగ్గట్లుగా సరిపోవటం లేదు. అమావాస్యకు దాదాపు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక అధికంగా ఉంటుంది. 20 వేల నుంచి 30 వేల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తారు. మిగతా పండుగల సమయాల్లోనూ, ప్రత్యేక రోజుల్లోనూ భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున ఆలయానికి వస్తారు, కానీ భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఇక్కడ ఏర్పాట్లు అంతగా లేవని, అంతా అసౌకర్యంగా ఉంటుందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆదాయం వస్తున్నా..

స్వామివారి జాతర బ్రహ్మోత్సవాలు దాదాపు నెలరోజులు జరుగుతాయి. భక్తుల నుంచి రూ.కోటిన్నర దాకా ఆదాయం సమకూరుతున్నా, ఆలయం అభివృద్ధి మాత్రం నోచుకోవటం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పుడు కొలువుదీరిన కొత్త ప్రభుత్వమైనా ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కృత్యాధార బోధన చేయాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 6 : విద్యార్థులకు నిజమైన ప్రయోగశాల తరగతి గది అని, ప్రతీ ఉపాధ్యాయుడు పాఠాలు బోధించే సమయంలో ప్రయోగం చూపించాలని డీఈవో రవీందర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సైన్స్‌మ్యూజియంలో టెక్‌మహీంద్రా సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రీంఫోర్స్ సహకారంతో మూడు రోజుల పాటు సైన్స్ టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో రవీందర్ హాజరై మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలలో గల ప్రయోగాలపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ సైన్స్ ఉపాధ్యాయుడు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు. ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారులు బాలుయాదవ్, డ్రీమ్‌ఫోర్స్ ప్రతినిధులు, సబ్జెక్ట్ ఫోరం బాధ్యులు, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింములుగౌడ్, శంషీర్, స్రవంతి, సత్యానంద్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

హన్వాడ, జనవరి 6 : మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కొనగట్టుపల్లి ఎంపీటీసీ పెద్దచెన్నయ్య ప్రారంభించారు. నాయినోనిపల్లి గ్రామనికి చెందిన అక్కపల్లి చెన్నమ్మ మొగులయ్య స్మారకార్థం గ్రామ బీజేపీ నాయకుడు అక్కపల్లి కృష్ణయ్య ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. వివిధ మండలాలకు చెందిన 30 టీంలు పాల్గొనున్నట్లు నిర్వాహకుడు తెలిపారు. విజేతకు 15000, రన్నరప్‌కు 10000 బహుమతులు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడారు. క్రీడాపోటీలను పండగ వాతావరణంలో జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు తిరుపతయ్య రామకృష్ణ, శ్రీనివాసులు, భీమేష్, జనార్దన్, సత్యం, కేశవులు, శ్రీను, అంజి క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

12న కూచూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్

నవాబ్‌పేట, జనవరి 6 : మండలంలోని కూచూర్ గ్రామంలో ఈనెల 12న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పటోళ్ల నాగిరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు ఒక్కరోజు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గినవారు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, పిట్టల రవి, భోజయ్యాచారి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు ఈశ్వర్ పేరున క్యాలెండర్

పాలమూరు, జనవరి 6 : సీపీఎం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా అనేక ఏళ్లపాటు పనిచేసిన వనగంటి ఈశ్వర్ పేరుమీద 2024 క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో భూపోరాటాలు, అంబలికేంద్రాలు, సాగునీటి ప్రాజెక్టులపై వ్యవసాయ కూలీల రేట్లు పెంచాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలనే పలు సమస్యలపై వనగంటి ఈశ్వర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేడు అప్రజాస్వామిక విధానాలు చేపడుతూ ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని ఖూనీ చేస్తూ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి తెచ్చి ప్రజల్లో అనైక్యతను పెంచే మతోన్మాదం చర్యలను ఖండించాలన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారతదేశాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు రాంరెడ్డి, కిల్లెగోపాల్, కురుమూర్తి, బి.చంద్రకాంత్, గాలెన్న పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ కళ్యాణి

పాలమూరు, జనవరి 6 : జాతీయ రహదారి బాలానగర్ చౌరస్తాలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని బాలానగర్ జెడ్పీటీసీ శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తరచుగా బాలా నగర్ చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతుండటం బాధాకరమన్నారు. 5వ తేదీన ప్రమాదం జరిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు. వాహనాలు అతివేగంగా వెళ్లకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలన్నారు.

వెండిపోచమ్మ దేవాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాలమూరు, జనవరి 6 : వెండి పోచమ్మ (శీతలాదేవి) ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ప్రతీ ఏడాది మాదిరి ఈ సంవత్సరం నూతన సంవత్సరం క్యాలెండరును అమ్మవారి ఫొటోలతో ఆవిష్కరించటం సంతోషంగా ఉందని అధ్యక్షుడు కె.శ్రావణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వేదకుమార్, బుట్టి ఆనంద్, కొత్తసత్యం, కస్తుబాలస్వామి, పూజారి పాల్గొన్నారు.

వ్యవసాయంలో అధునాతన పరికరాలు వాడాలి

గండీడ్, జనవరి 6 : అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో రైతులు ఆధునాతన పరికరాలతో డ్రోన్ ద్వారా ఎరువులు పిచికారి చేసుకొని రాబడి పెంచుకోవాలని బీజేపీ అధ్యక్షుడు ప్రభునాయక్, సర్పంచు జితేందర్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని సల్కర్‌పేట్ గ్రామంలో వ్యవసాయ పొలాల్లో ఎరువులు పిచికారి చేసే డ్రోన్‌ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అధునాతన పరికరాలు బ్యాంకుల్లో సబ్సిడీతో మహిళ సంఘాలకు, రైతులకు మంజూరవుతాయని పేర్కొన్నారు. అటల్ పెన్షన్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని, 80 శాతంతో స్వయం సహాయక సంఘాలకు ఆర్థికంగా సమకూరుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ఉంటే 10 లక్షల కార్పొరేట్ వైద్యం ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు గిరమోని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు వెంకటయ్య, గిరమోని శేఖర్, ద్యావరి వెంకటయ్య నరేష్ పాల్గొన్నారు.

నేడు తాత్కాలికంగా విద్యుత్ నిలిపివేత

జడ్చర్ల, జనవరి 6 : జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మ పేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ నరేందర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడ్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కావేరమ్మపేట, ఇందిరానగర్, జౌకీనగర్, జాతీయరహదారిపై, హౌజింగ్‌బోర్డు, విజయనగర్‌కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పెంపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 6 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-2025 విద్యాఏడాదికి గాను ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 20 వరకు పొడిగించినట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్‌రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గురుకులాల్లో సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి అర్హత పరీక్ష 2024 ఫిబ్రవరిలో ఉంటుందని తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

- మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు

నవాబ్‌పేట, జనవరి 6 : భర్త మందలించాడని మనస్తాపం చెందిన ఓ మహిళ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రారంలో ఇప్ప యాదయ్య, అరుణ(40) భార్యాభర్తలు. గత శుక్రవారం ఇద్దరూ గొడవపడ్డారు. ఈ విషయంలో యాదయ్య తల్లి అంజమ్మ కోడలైన అరుణ(40)ను మందలించింది. భార్యాభర్తలిద్దరూ మంచిగా ఉండాలని సూచించింది. శనివారం అరుణ తన వ్యవసాయ పొలంలో మామిడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన కోడలి మృతిపై తనకు అనుమానం ఉందని అజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్ష

జడ్చర్ల, జనవరి 6 : జడ్చర్ల మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు శనివారం బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. గంగాపురం పీహెచ్‌సీ అధికారి డాక్టర్ శివకాంత్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 180 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని, ఆరోగ్యంగా ఉండాలంటే జీవన విధానం ఎలా ఉండాలో ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ శివకాంత్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు, హెల్త్‌అసిస్టెంట్ శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎం కరుణలతో పాటు ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవి ఉపసంహరణ

గండీడ్, జనవరి 6 : కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పరిగి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డి.వెంకటయ్యను పదవి నుంచి ఉపసంహరించామని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పి.నర్సిములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డితో చర్చించిన అనంతరం పూర్తి స్థాయి నియోజక వర్గ కమిటీని ఏర్పాటు చేస్తారని తెలిపారు.

మధ్యాహ్నం బిల్లులు అందేనా ?

బిల్లులు రాక ఏజెన్సీల అవస్థలు

- వారానికి మూడు గుడ్లకు గాను ఒక్కటే..

- కరువైన పర్యవేక్షణ

హన్వాడ, జనవరి 6 : మధ్యాహ్న భోజన పథకం బిల్లులు సకాలంలో ఏజెన్సీ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువులతో పాటు గుడ్ల ధరలు పెరుగుతుండడంతో పథకం అస్యవస్థం అయ్యింది. పాఠశాలల్లో నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో పక్క గుడ్డు ధర రోజురోజుకు పెరుగుతుండడంతో విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందడంలేదు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.7కు చేరడంతో విద్యార్థులకు భోజనంలో వారంలో మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉంటే, ఒకటి, రెండు పెడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒక్కటి మాత్రమే ఇస్తున్నారు. సకాలంలో బిల్లులు ప్రభుత్వం వంట ఏజెన్సీలకు చెల్లించకపోవడంతో భోజనంలోనూ నాణ్యత లోపించింది. గ్రామాలలో కొందరు యువకులు ప్రశ్నించినా ఫలితం లేదు. మండలంలో 1 తరగతి నుంచి 10వ తరగతి వరకు 6,223 మంది విద్యార్థులు ఉన్నారు.

బిల్లులు లేక ఇబ్బంది పడుతున్నాం

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు సకాలంలో రాక పెరుగుతున్న గుడ్ల ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి విద్యార్థులకు వంట చేసి భోజనం పెడుతున్నాం. గుడ్ల ధరలు పెరగడం వల్ల విద్యార్థులకు పండ్లు ఇస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించాలి.

- మంగమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

నాలుగు నెలల పెండింగ్

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చేసి అప్‌లోడ్ చేశాం. నిధులు ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తే అప్పుడే వంట ఏజెన్సీలకు వస్తాయి. గుడ్లు, నాణ్యమైన భోజనం అందించాలని ఎప్పటికప్పుడు, హెచ్‌ఎం, ఏజెన్సీలను ఆదేశిస్తున్నా.

- రాజునాయక్ ఎంఈవో, హన్వాడ



లింగన్నపల్లిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రైవేట్ జూనియర్ కళాశాల యజమానుల సంఘం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా విజేత వెంకట్‌రెడ్డి




వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న వాగ్దేవి కళాశాల యాజమాన్యం, సిబ్బంది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 6 : ప్రైవేట్ జూనియర్ కళాశాల యజమానుల సంఘం జిల్లా అధ్యక్షులుగా వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సమావేశంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా విజేత వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా జగన్, ఉపాధ్యక్షుడిగా సురేష్, ఐజాక్, జాయింట్ సెక్రటరిగా వెంకట్‌రాము లు, గౌరవ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్, సలహాదారులుగా సత్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, రాఘవేందర్‌రావు, సతీష్‌రెడ్డి, అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆలయం అభివృద్ధికి కృషి

రూ. 45 కోట్లతో డబుల్ రోడ్డు ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, జనవరి 6 : మండలంలోని వెలుగొమ్ముల గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి రూ. 5లక్షలను త్వరలోనే అందజేస్తానని తెలిపారు. రూ. 45కోట్లతో కొత్తూర్ గ్రామం నుంచి వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిలువేరు, రెడ్డిగూడ గ్రామం నుంచి కల్వకుర్తి, జడ్చర్ల ప్రధాన రహదారి వరకు డబుల్‌రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ, బ్యాండుమేళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. అనంతరం అనిరుధ్‌రెడ్డిని ఆలయ చైర్మన్ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయులు, మల్లికార్జున్‌రెడ్డి, శివ, శంకర్‌నాయక్, శ్రీధర్‌రావు, విజయాజీ, రవీందర్‌రెడ్డి, శంకర్, వీరాజీ తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

- అయోధ్య పూజిత అక్షింతల పంపిణీలో వక్తలు



పట్టణంలో శోభాయాత్రలో మాట్లాడుతున్న డీకే అరుణ

హన్వాడ, జనవరి 6 : అయోధ్యలో శ్రీరాముని ఆలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, బీజేపీ మండల నాయకులు రఘురాంగౌడ్‌లు కోరారు. శనివారం పెద్దదర్పల్లిలో అయోధ్యరాముడి పూజిత అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని శ్రీరామ జయరామ కీర్తనలు పడారు. ప్రజలందరు అక్షింతలను తీసుకొని పూజలు చేయాలని ఈ నెల 22 అయోధ్య ఆలయ ప్రతిష్ఠ రోజు దేవాలయాలు, ఇళ్లలో పూజలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యాదయ్య, శ్రీను, సుమన్, నరేష్, రామకృష్ణ, వినీత్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకులలో అక్షింతల పంపిణీ

అడ్డాకుల : మండల కేంద్రంలో శనివారం అయోధ్య రాముడి పూజిత అక్షింతలను గ్రామస్థులు, యువకులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శ్రీశివాంజనేయ షిరిడీసాయి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి అక్షింతలను ఆధ్యాత్మిక శోభతో జై శ్రీరాం.. జైజై శ్రీరాం అంటూ పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇంట్లో దీపాలు వెలిగించి అక్షింతలకు ఇంట్లో పూజచేసి అందరు చల్లుకోవాలని సూచించారు.

ఇంటింటా శ్రీరామ నామం

భూత్పూర్ : ఇంటిటా శ్రీరామ నామం జపిస్తూ విశ్వహిందూ పరిషత్ మాతృమండలి మహిళలు శనివారం శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ పరిధిలోని 4, 5, 9, 10వ వార్డుల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ఊరేగించారు. విశ్వహిందూ పరిషత్ మాతృమూర్తి మండల మహిళలు సరస్వతి, శ్రీలత, రామేశ్వరమ్మ, లక్ష్మమ్మ, ఆంజనేయస్వామి భజన మండలి అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, రాము, వెంకటేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి నామకరణంపై హర్షం

పాలమూరు : అయోధ్య నగరంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయటం సంతోషంగా ఉందని వాల్మీకు(బోయ)లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వాల్మీకులు, భక్తులు పెద్దఎత్తున శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఏపీ మిథున్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. సీతారామలక్ష్మణ, మహర్షివాల్మీకి వేషధారణలో చిన్నారులతో యాత్ర చేపట్టారు. రాష్ట్రంలో వాల్మీకి బోయలు ఎంతోకాలంగా తమను ఎస్టీ జాబితాలో చేర్చమని కోరుతున్న విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కార్యక్రమంలో మృత్యుంజయ పంచముఖ అంజనేయస్వామి అంతర్జాతీయ తత్వజ్ఞాన ధర్మ ప్రచారకర్త మహర్షి శ్రీ రగోతమాచార్యులు, విశ్వహిందూపరిషత్ నాయకులు రాచాల జనార్దన్, నలిగేషి లక్ష్మీనారాయణ, హనుమంతు, తెలంగాణ వాల్మీకి సంఘం రాజు అధ్యక్షుడు న్యాయవాది కురమయ్య, మాజీ కౌన్సిలర్ పెద్దన రసింహులు, పొన్నకల్ కృష్ణయ్య, ఎర్రం నరసింహులు, కె.సతీష్ కుమార్, దుర్గాప్రసాద్, నాగరాజు, బోయరమేష్, సాయిపవన్, యాదయ్య, సత్యం, వెంకటయ్య అల్లన్న, దాసు, రాఘవేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



అడ్డాకుల : అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన

- పూజలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

మిడ్జిల్, జనవరి 6 : మండలంలోని వెలుగొమ్ముల గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠపన, హోమాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలను వేదపండితులు గంగాపూరం లక్ష్మీనారాయణ ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మానందగిరి స్వామి, రాజుశర్మ బృందం ఆధ్వర్యంలో శనివారం వైభోవపేతంగా నిర్వహించారు. స్వామి వారి యంత్ర ప్రతిష్ఠపన పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠపన కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లడారు. ప్రతి భక్తి బావంతో ముందుకు సాగాలని ప్రజలకు సూచించారు. గ్రామానికి వచ్చిన లక్ష్మారెడ్డిని అంతకు ముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మారెడ్డిని ఆలయ చైర్మన్ రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య ఆలయ అర్చకులు రాజేష్‌శర్మ, నాయకులు జంగారెడ్డి, బాల్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్‌గుప్తా, జగన్‌గౌడ్, సత్యంగుప్తా, సుకుమార్, నాగేష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, సాయులు, రాజేందర్‌రెడ్డి, మన్యం, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, రాఘవరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ముగిసిన ప్రజాపాలన సభలు



పలుగుతండాలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రాజాపూర్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 28వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పటు అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. శనివారం చివరి రోజు మండలంలోని పలుగుతండా గ్రామంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఇద్గాన్‌పల్లి గ్రామంలో ఎంపీడీవో లక్ష్మీదేవిలు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి అభయహస్తం దరాఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అలివేల, కవిత, ఎంపీవో వెంకట్‌రాములు, వ్యవసాయాధికారి నరేందర్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో 11742 దరఖాస్తులు

చిన్నచింతకుంట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వాటిని అమలుచేసేందుకు గ్రామాల్లో ముమ్మరంగా ప్రజాపాలన ద్వారా 6 గ్యారెంటీలకు సంబంధించిన వాటికి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించే కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రజాపాలనకు శనివారం చివరి రోజు కావటంతో దరఖాస్తులు పెద్ద ఎత్తున వచ్చాయి. గ్రామాల వారీగా పరిశీలిస్తే అల్లీపురం 552 దరఖాస్తులు, అమ్మాపురం 612, బండర్‌పల్లి 646, చిన్న వడ్డెమాన్ 370, చిన్నచింతకుంట 1939, దమాగ్నాపూర్ 592, ఏదులాపూర్ 253, పర్థీపూర్ 848, గోప్యానాయక్ తండా 209, గూడూరు 266, కురుమూర్తి 723, లాల్‌కోట 896, మద్దూరు 540, నెల్లికొండి 727, పల్లమర్రి 448, సీతారాంపేట 262, ఉంద్యాల 1416, పెద్ద వడ్డెమాన్ 442 కలిపి మొత్తం 11,742 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కొనసాగుతున్న పూజలు

నవాబ్‌పేట, జనవరి 6 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారికి జాతర మహోత్సవాల్లో భాగంగా పూజలు కొనసాగున్నాయి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పాశం కృష్ణయ్య తెలిపారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 6 : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రాంతీయ శిక్షణ మేనేజర్‌గా పని చేసేటకు పదవీ విరమణ పొందిన గెజిటెడ్ అధికారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజర్ నియామకానికి కావాలిసిన అర్హతలు పదవీ విరమణ పొందిన గెజిటెడ్ అధికారి అయి ఉండాలని, 62 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, ఏదేని డిగ్రీ కలిగి, ఆపై విద్యార్హత కలిగి ఉన్నవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వము అమలు చేసే చట్టాలు, స్కీములపై అవగాహన తగిన క్షేత్ర అనుభవం, శిక్షణ ఇచ్చే అనుభవం కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో నివాసం కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం కింద నెలకు రూ. 30,000 ఇవ్వనున్నట్లు తెలిపారు. పై నిబంధనలకు లోబడి అర్హులైన వ్యక్తులు తగిన విద్యార్హత ధ్రువపత్రాలు జతపరిచి ఈ నెల 20లోగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.